రాక్షస కృత్యాలు

1

గణపతికి మేనమామగారింట్లో అడుగుపెట్టేవరకూ అనుభవంలేదు కాని అభిప్రాయాలున్నై. ఉన్న అభిప్రాయలేమో చాలా దృఢంగా కూడా ఉన్నై.

మొదటి సంగతి అతనికి స్త్రీనిచూస్తే గౌరవం లేదు. అతనికి ప్రేమలో నమ్మకం లేదు. వివాహం ఇష్టం లేదు. పెళ్ళి చేసుకోవటం, పిల్లలను కనటంకంటె నీచమైన పనిలేదని అతని దృఢమైన నమ్మకం. పిల్లలను కంటుండి కనకనే స్త్రీ అతని దృష్టిలో లోకువైపోయింది.

లేకపోతే పురుషోత్తంచారి రెండోఅమ్మాయి మణిని అతనికిచ్చి ఉండవలసింది. ఆయనకిద్దరాడపిల్లలూ, ఒక లక్షరూపాయలఆస్తీ, అమితమైన పెంకెతనం తప్ప చెప్పుకోదగినవేవీలేవు. ఆయన కెంతతట్టితే అంత. అకస్మాత్తుగా

ఆయనకు గణపతి మణిని చేసుకుంటే తన సగం ఆస్తికి యజమాని అయ్యేవాడు కదా, దాన్ని కూడా వ్రతంకోసం తోసేశాడుకదా, అతనికి తప్పకుండా ఇప్పటికైనా సగంఆస్తి ఇచ్చి ఇంట్లో ఉంచుకోవలసిందే, అని తట్టింది ఒకరోజున. ఆరోజే గణపతికి ఉత్తరం వెళ్ళింది. మూడోరోజున గణపతి దిగాడు.

ముందు గణపతికి ఇంట్లో అడుగుపెట్టగానే మణి కనపడ్డది. మణికి పదిహేనోఏడు. రజస్వలాఅయి రెండుసంవత్సరాలయింది. కాని కాపరానికింకా పోలేదు. గణపతి మణినిచూసి అప్పటికి చాలాకాలం అయింది. ఇప్పుడామెను చూడగానే అతనికి ఆశ్చర్యం కలిగింది. మణి అంత బాగుంటుందని అతని కెన్నడూ తట్టలేదు. ఆ భారం అప్పటి కంతటితో పోయింది.

గణపతికి మేనమామ మంచి ఆతిథ్యం ఇచ్చాడు. ఇద్దరూ సంసార విషయాలు మాట్లాడుకున్నారు.

ఇంట్లో కూడా గణపతికి వేరే ఒకగది ఉండటం అలవాటు. అందుకని అతను మేడమీద ఏద్లైనాగది ఖాళీగా ఉంటే ఆక్రమించుకుందామని బయలు దేరాడు. మణి వెంట వచ్చింది. అసలు మణే అన్నది 'పైన ఒక చక్కనిగది ఉంద'ని.

మెట్లెక్కుతూ గణపతి "మామయ్యకు ఇంటి విషయం ఇంత శ్రద్ధలేదేం? ఈ మెట్లపక్కన నాలుగురూపాయలు ఖర్చుచేసి అడ్డం కట్టించరాదూ? ఎవరైనా పడిపోతే కింద?" అన్నాడు.

"మాకందరికీ అలవాటే!" అన్నది మణి.

మణి చెప్పినగది మెట్లకు ఎదురుగానే గజం దూరంలో ఉంది.

"చాలా బాగా ఉంది. గది కాస్త బాగుచేస్తే!" అన్నాడు గణపతి.

"నేను బాగుచేస్తాను బావా!" అన్నది మణి.

మణి గది శుభ్రంగా ఊడ్చి బాగుచేసేలోపల గణపతి ఎక్కణ్ణించో రెండుకుర్చీలూ ఒకబల్లా పట్టుకొచ్చాడు. గణపతికి గది అమరింది.

"బాగానే ఉంది. కిందినించి కేక పెడితే చప్పున వినిపిస్తుంది. నేనిక్కణ్ణించి వెళ్ళేలోపల ఇల్లు కొంత మరమ్మతుచేసి మరీపోతాను.... కిందికిపోదాం పద" అన్నాడు గణపతి. అతనికి మేనమామ ఉద్దేశం తెలీదు.

2

గణపతికి కాలం గడచిన కొద్దీ తనలో తనకు నమ్మకం తగ్గటం ప్రారంభించింది. మొదట మొదట అతను నమ్మక పోయినాడు కాని, అతనిలో ఒకవిధమైన మార్పు కలగటం మొదలు పెట్టింది. నిజంగా మణి తన్నాకర్షిస్తున్న

దంటే అతనికి నమ్మకం కలగలేదు. కాని ఆమెను చూస్తే తనకు కలుగుచున్న వికారం, ఆకర్షణ కాకపోతే ఏమిటి? తన్ను స్త్రీ ఆకర్షించటమేమిటి? ఆ ఆకర్షణ తన మనస్సుకు అసహ్యకరం కాకపోగా చాలా ఉత్సాహకరంగా ఉండటమేమిటి? నిజంగా స్త్రీ తననుకున్నంత చెడ్డది కాదేమో? మణిలో ఏమీ చెడున్నట్టు కనపడ లేదు. తనకు స్త్రీని గురించి ఏమీ తెలీదని గ్రహించాడతను.

అయినా మణికీ తనకూ ఏం సంబంధం? మణి ఒకరి సొత్తయిపోయింది. అమాట అనుకుంటే అతనికి చాలాకష్టం కలిగింది. తనలోపం లేకుండా అతను సాధ్యమైనంతవరకు మణిని తప్పించుకు తిరిగేవాడు. మణి ఎక్కడ వస్తుందోనని భయం కూడా ఉండేది. కాని తీరా వచ్చిం తరవాత అతని మనస్సు అవశమై పొయ్యేది. మణి తనకెదురుగా కూర్చుని ఏదో విషయాలు మాట్లాడుతుంటే వినటంవల్ల పాపం ఏమిటి పోనిమ్మనుకునేవాడు. కాని ఆమె అవతలికిపోయిన తరవాత మణి రాకుండా ఉంటే మనస్సెంత శాంతంగా ఉండేదనిపించేది. ఎప్పుడోచదివి అసహించుకున్న ప్రణయ కథలన్నీ అతనికిప్పుడు జ్ఞాపకం వస్తుండేవి. ఇటువంటి చిన్న చిన్న చితుకులతో అతని హృదయం రగులు కోవటం మొదలుపెట్టింది. ఆ మంటను మణి బావకు అనేక విధాల సహాయం చేస్తూ ఆజ్యంపోసి పెద్దజ్వాలగా చెయ్యటం మొదలుపెట్టింది.

అతనప్పుడు మణినెందుకు చేసుకోలేదు? ఈ జీవితంలో అన్నీ పొరపాట్లే కనిపిస్తాయేం? అప్పుడప్పుడు గణపతి "ఈ ఇంట్లో ఎంతకాలమో నిలవలేను!" అనుకునేవాడు.

గణపతి మేనమామగారింటికి వచ్చి నెలరోజులైంది. ఒకరోజున అతనికి వళ్ళు తెలియని జ్వరం వచ్చింది. మణి ఉపచారం చేస్తూ వచ్చింది. మణికి కావలసినంత స్వతంత్రం. ఆమె బావతో స్వేచ్ఛగా మాట్లాడుతున్నందుకు ఎవరూ తప్పుపట్టలేదు. గణపతి రెండుమూడు రోజుల్లో సహజస్థితికి వచ్చాడు.

తరవాత సరిగా వారంరోజులకు కాబోలు! మణి భర్త అకస్మాత్తుగా మరణించినవార్త వచ్చింది.

3

ఈ దుఃఖంలో గణపతిని గమనించిన వారెవరూలేరు. అతనెక్కువకాలం గదిలో గడపటం మొదలుపెట్టాడు. మొదట మొదట అతని ఆలోచలు మణి మీదనే ఉన్నై. మణిభర్త పోవటం తనతప్పే ననిపించిందతనికి. తనెప్పుడో చేసిన సుకర్మను మెచ్చుకుని, భగవంతుడు మణికీ తనకూ మధ్య భర్తను తీసేశాడు. కాని తను మణిని ఈస్థితిలో వివాహం చేసుకోగలడా? ఉత్తది! మణి

ఇప్పుడు విధవ. నిన్నటి మణి కాదు. తనకు విధవా వివాహాలు ఎన్నటికీ ఇష్టంకావు. ఇకే చేసుకుంటే మణికోసం చేసుకోవాలికాని. అయినా దీనికింత ఆలోచన ఎందుకు? మణిని తనెన్నటికీ చేసుకోలేడు. అసంభవం. అతనికంతవరకు రూఢిగా తెలుసు.

మణిసంగతి ఏమవుతుంది? ఏమవుతుందీ? తన చనిపోయిన చెల్లెలు సావిత్రికైనట్టే అవుతుంది. ఎందువల్లో అతనికి సావిత్రి విధవైనప్పుడింత కష్టంగాలేదు. అతనప్పుడు మనిషికాదు. రాక్షసుడు. సావిత్రికి పాపం కేశఖండనం చేశారు. తన బలవంతం లేకపోతే ఆపని తన తండ్రి మిగిలినవారు చెయ్య నిచ్చేవారుకారు. ఆ రాక్షస కృత్యానికి తనే కారణం. అహా! భగవంతుడా!

అది తలచుకోగానే గణపతిగుండె బద్దలయిపోయింది. కళ్ళవెంట నీరు కారటం మొదలు పెట్టింది. సంవత్సరంకింద అతనిలో అంత రాక్షసత్వం ఉంది కాబోలు. సావిత్రిలోపల తన్ను చూసి ఎంత భయపడ్డదో! ఏమనుకుందో! గణపతి పక్కమీద బోర్లాపడుకుని ఏడవటం మొదలుపెట్టాడు. ఆ దుఃఖం ఎంతకూ తెగలేదు. సావిత్రి చావుకూ వైధవ్యానికీ ఏమీ సంబంధంలేదు. కాని ఆమె చచ్చిపోవటం అతనికి ఉపశమనం చెయ్యకపోగా దుఃఖ కారణమైంది ఆ చావుకూ్కడా తనే కారణం. తనీప్రపంచంలో పుట్టకపోతే ఇంత రాక్షస కృత్యాలు జరగవు. ఇప్పుడేమిచేస్తే తన పాపం పరిహారం అవుతుంది? ఏం పరిహారం కాకపోతే? అది తన్ను దహించినా పాపంలేదు!

ఆ సాయంత్రం గణపతితప్ప తక్కినవారంతా ఊరికివెళ్ళారు, మర్నాడు తిరిగి వస్తామని చెప్పి. ఆ రాత్రి అతనికి సాక్షాత్తూ నరకమనిపించింది. మర్నాడల్లా ఎట్లా గడిచిందో అతనికి తెలియదు. హోటల్లో భోంచేసి వచ్చాడు. అనుకున్న ప్రకారం రాత్రికి రాలేదు, వెళ్ళినవాళ్ళు. గణపతి భోజనం లేకుండానే పడుకున్నాడు.

మూడో నాడుదయం అంతా తిరిగి వచ్చారు. కాని అతనెవ్వరినీ గమనించేటట్టు లేడు. అతని ఆలోచనల్లో, కళ్ళల్లో ఒక్కటే వ్యక్తి. ఒక కేశ రహిత అయిన బాల వితంతువు. అతను ఎరుగునో ఎరగడో! కాని అతనామెను గురించి విడవకుండా ప్రార్థన చేస్తున్నాడు. అతని మనస్సులో దుఃఖం లేదు. ఆ మనస్సులో మణి లేదు. మణి వైధవ్యం లేదు. ఇక ఏమీలేదు. పశ్చాత్తాపం కూడా లేదు. ఆ రూపం అతని మనస్సులో పాతుకుపోయింది. అతనికి కాలగతి తెలీకుండా పోయింది. మధ్యమధ్య అసందర్భంగా "నేనే చేశాను! రాక్షసప్పని!" అని గొణుక్కుంటూ ఉండేవాడు. ఏ భావం అయినా అతిగా పోయినప్పుడు వెర్రిని పోలుతుంది.

ఈలోపల మణి జీవితంలో గొప్ప మార్పులు జరుగుతున్నై. ఒకప్పుడు గణపతికి తట్టిన ఆలోచనే పురుషోత్తం గారికి తట్టింది. మణికి కేశఖండన చెయ్యాలని తీర్మానించాడు.

చాలామంది అనేక రకాలుగా చెప్పారు.

"ఈ ఒక్క పనికి వెరిస్తే ఆ పసిదానికి ఎంతో పాపం చెయ్యటాని కవకాశంఇస్తాం. అనేక దుర్బుద్ధులు పుడతై. కొంతకాలమైన తరవాత పునర్వివాహ మంటారు. నాకు తెలీదా? మణి సావిత్రికన్న చిన్నదా? దానికి తీయించారు కారా జుట్టు. నేను వప్పుకోను. నేను మా బావకన్న (గణపతి తండ్రి అన్నమాట!) తక్కువ గుండె నిబ్బరం కలవాణ్ణా?" (ఇందులో అహంకారం కొంత!) అది పురుషోత్తంగారి వాదన.

మణి కీవార్త వినగానే ప్రాణం పోయినట్టయింది. తనకు వివాహం చెయ్యగలవారెవరు? గణపతి స్థితి ఎవరూ గమనించకపోయినా మణి గమనిస్తున్నది. ఆతను కొంతకాలంనించీ అఘోరకంగా ఉంటున్నాడు. ఎప్పుడూ పైనే ఉంటున్నాడు సరిగా భోజనం చెయ్యటంలేదు. మర్నాడే తనకు ప్రాయశ్చిత్తం చేస్తారు. అతనొక్కడే తనకు దిక్కు.

మణి కేశఖండనం గురించి గణపతికేమీ తెలియదు. రాత్రి తొమ్మిది గంటలు దాటింది. అతనాపూట భోజనం చెయ్యలేదు. కిందికిపోలేదు. పక్కమీద పడుకుని తపన పడటం మొదలుపెట్టాడు.

"బావా!"

మణి! తన్ను రాక్షసత్వాన్నించి మానవత్వానికి లాగిన మణి! అతను లేచి, తలుపుతీసి మణిని లోపలికి రానిచ్చాడు. మణి ఏడుస్తున్నది.

"మణీ!"

మణి ఏడుపు జాస్తయింది.

"ఎందుకు?" అన్నాడు గణపతి అర్థం లేకుండా.

"రేపు—నా—జుట్టు—" పైన మణికి మాట రాలేదు.

"నీకా?"

మణి కళ్లు తుడుచుకుంటూ తల ఊపింది.

"ఎవరు?"

"నాన్న,"

గణపతి మాట్లాడలేదు. ఇంకా రాక్షసులున్నారన్నమాట ప్రపంచంలో!

"నాకు జుట్టు తీయించుకోటం ఇష్టంలేదు బావా!"

గణపతి కళ్ళవెంట నీళ్ళు కారటం మొదలుపెట్టినై. ఉప్పొంగిపోయినట్టు కనపడ్డ హృదయం తిరిగి చెమ్మగిల్లింది. సావిత్రి కూడా ఇట్లాగే అనుకుని ఉంటుంది, సావిత్రి ఎవరితో చెప్పుకుంటుంది?

"నేనేం చెయ్యను? మణీ!"

"నువ్వాపలేవా?"

"నేను దుర్మార్గుణ్ణి! అనాథను! నా చేతేమవుతుంది?"

మణి తల వంచుకుని వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది. అయిదు నిమిషాలయింది. గణపతి అక్కడే నిలబడ్డాడు. అతని కెక్కడలేని శక్తి రావటం ప్రారంభమైంది. రక్తం వేగంగా పారటం మొదలుపెట్టింది. శరీరం పొంగిపోయింది. ఒకవిధమైన తీర్మానానికి వచ్చింది మనస్సు. కనుబొమలు ముడిబడ్డై.

తన శరీరంలో ప్రాణం ఉండగా మణికి జుట్టెట్లా తీస్తారో చూస్తాను! తనకామాత్రం మగతనం లేదా? తనక్కడ ఉండగా ఇంకొక రాక్షసత్వం జరగనా? ఉత్తది. గణపతి తలుపు తీసుకుని బయటికి పరుగెత్తాడు.

ఇంకా పురుషోత్తంగారూ భార్యా నిద్రపోలేదు. మణి నిద్రపోతున్నట్టు పడుకుంది, కాని నిశ్శబ్దంగా ఏడుస్తున్నది. ఇంతలో దభాలున పెద్ద చప్పుడైంది. కేక వినపడ్డది. పురుషోత్తంగారు లేచి కూర్చుని విన్నాడు. ఏమీ వినిపించలేదు కొంతసేపు. పైన మూలుగు వినపడ్డది కొంపమునిగిందని భార్యాభర్తా దీపం తీసుకుని బయటికి పరుగెత్తారు. మెట్లకింద గుర్తు పట్టటానికి వీలు లేకుండా గణపతి శరీరం మసులుతున్నది. అంతా నెత్తురుమయం. అతని మొహం భయంకరంగా ఉంది. పురుషోత్తంగారు "గణపతీ!" అన్నాడు.

గణపతి మూలిగాడు.

"ఏమిటిది?"

"నేనే చేశాను!.... రాక్షసప్పని!" మాటలు స్పష్టంగా వినపడలేదు. పురుషోత్తగారికి దగ్గిరికి పోవటానికి ధైర్యంలేదు. ఇప్పుడే కాళ్ళు వణుకుతున్నై.

"నా ప్రాణం ఉండగా....మణికి జుట్టు....నాదే ఆ పాడు పని!" గణపతి ఒక పక్కకు పొర్లి నిశ్చలంగా పడుకున్నాడు. అతని నోటివెంట ఇంకేమీ గొణుగుడు వినపడలేదు.

(ప్రథమ ముద్రణ : అక్టోబరు 1932, గృహలక్ష్మి)